క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



నరసాపురం జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శ్రీజ్ఞాన సరస్వతీదేవి విగ్రహం

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు శ్రీజ్ఞాన సరస్వతీ దేవి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. 1990-91 విద్యాసంవత్సరంలో పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు రూ.లక్ష ఖర్చుతో శ్రీజ్ఞాన సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివినందుకు గర్వకారణంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు ఆహ్వానం

రాజుపాళెం : మండలంలోని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఎంఈఓలు ప్రసాద్, రామస్వామిరెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వారు సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం 2005 చట్టం 12(1) సి ప్రకారం ఆ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం అర్హత కలిగిన బాలబాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఐదేళ్ల పూర్తయిన పిల్లలకు 1వ తరగతిలో మిగిలిన 25 శాతం సీట్ల భర్తీ కోసం ఈ అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీ, ఓసీ వర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలు అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీలోపల ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. అలాగే గ్రామంలోని సచివాలయం, ఆన్‌లైన్ సెంటర్లలో అడిగితే వివరాలు తెలుపుతారన్నారు. అనంతరం ఉచిత ప్రవేశాలపై పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్, మోరే కుటుంబ సభ్యులు, లహరి గ్రూప్ సహకారంతో అన్నప్రసాద సేవా కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సుమారు 500 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు పేర్కొన్నారు. దాతల సహకారంతో నాలుగేళ్లుగా ప్రతి సోమవారం అన్నప్రసాద సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు విష్ణునారాయణ, లింగారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, దేవానంద్ పాల్గొన్నారు.

నేత్రదానం అభినందనీయం

ప్రొద్దుటూరు క్రైం : నేత్రదానం అభినందనీయమని జిల్లా ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన స్నేహసేవా సమితి అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీలక్ష్మి కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఆ సమయంలో మధుసూదన్‌రెడ్డి నేత్రాదానికి అంగీకరించడంతో పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రానికి ఆమె నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు చేతుల మీదుగా మధుసూదన్‌రెడ్డికి 'నేత్రదాత అమర్‌రహే' అనే శ్రీలక్ష్మి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి టెక్నీషియన్ రామకృష్ణ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ నూతన కమిటీ ఎన్నిక



జనవిజ్ఞాన వేదిక పట్టణ నూతన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నందినీ క్లాత్ మార్కెట్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో పట్టణ మహాసభల సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న సోమవారం తెలిపారు. నూతన అధ్యక్షుడిగా వేంపల్లి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నంగా రాజేష్, కోశాధికారిగా డాక్టర్ కె.చక్రధర్, ఉపాధ్యక్షులుగా పి.ఉషారాణి, జీటీ ఈశ్వరయ్య, డాక్టర్ దస్తగిరి, ప్రసన్నకుమార్, హేమంత్, గఫార్, కార్యదర్శులుగా ఎస్.సునీత, బాలసుందర్, మహేష్, మహిత, జయసింహ, పవన్, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ డి.నరసింహారెడ్డి, గౌరవ సలహాదారులుగా మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, గోపినాథరెడ్డి, డాక్టర్ పీవీ చంద్రశేఖర్, సతమ కన్వీనర్‌గా ఎస్.రాజ్యలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా 29 మందిని, ప్యాట్రన్స్‌గా ముగ్గురిని, విద్య, ఆరోగ్యం, పర్యావరణం, పబ్లికేషన్స్, చెకుముకి సబ్ కమిటీ కన్వీనర్లను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలను చేపడుతామని వారు పేర్కొన్నారు.

సర్కారు ఏడి 'పింఛన్'

- రీ వెరిఫికేషన్ పేరుతో అనర్హత వేటు
- నూరు శాతం అంగవైకల్యం ఉన్నా పింఛన్ తొలగింపు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు





పింఛన్ కోల్పోయిన దివ్యాంగురాలు ఓబుళమ్మ, చెన్నమ్మగారి నాగూర్‌బీ (మూగ)

కాశినాయన : అనర్హత పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగ పింఛన్‌దారుల కడుపు కొడుతున్నాడు. అనర్హత పేరుతో నిజమైన దివ్యాంగుల పింఛన్లను తొలగిస్తున్నారు. ఇన్నాళ్లు పింఛన్ వస్తుందన్న ఆశతో పింఛన్‌దారులు బతుకు వెళ్లదీశారు. ఇక మాకు దిక్కెవరు దేవుడా అంటూ పింఛన్ రద్దయిన దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి కాకుండా నకిలీ దివ్యాంగ పత్రాలు పొంది దివ్యాంగుల పింఛన్ పందుతున్న వారిని గుర్తించి ఏరివేతకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో మండలంలో 109 పింఛన్లను తొలగించారు. చెవిటి వారు 67, మెంటల్ 13, గుడ్డి, మూగ 36 పింఛన్లను తొలగించి వారికి నోటీసులు జారీ చేశారు. కడప రిమ్స్‌లో దివ్యాంగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో డాక్టర్లకు పైసలు ఇస్తే వికలాంగత్వం లేకున్నా ఒకే చేస్తున్నారని తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి 30వ తేదీన మండలం నుంచి 16 మంది రిమ్స్ ఆస్పత్రికి రీ వెరిఫికేషన్ కోసం వెళ్లారు. అందులో ఆరు మంది నూరు శాతం వికలాంగత్వం ఉన్నారు, వీరిలో నలుగురు మూగవారు, ఇద్దరు అంధులు ఉన్నారు. తమ దగ్గర వికలాంగత్వం జిరాక్స్ కాపీ, ఆధార్ కాపీ తీసుకుని పరీక్షలు చేయకుండానే పంపించారని, పింఛన్ కోల్పోయిన వారు తెలిపారు.

దివ్యాంగుల ఆందోళన

రిమ్స్ డాక్టర్లు మండలంలో బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని రూ.30వేలు తీసుకుని అదే రోజు 10 మందికి ఒకే చేశారని సమాచారం. మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన ఓబుళాపురం ఓబుళమ్మ పుట్టుకతోనే మూగ. నూరు శాతం వికలాంగత్వ సర్టిఫికెట్ పొందారు. 40 శాతం కంటే తక్కువ వికలాంగత్వం ఉందని డాక్టర్లు రిపోర్టు ఇవ్వడంతో ఓబుళమ్మ పింఛన్ తొలగించినట్లు నోటీసు అందించారు. గొంటువారిపల్లె గ్రామానికి చెందిన చెన్నమ్మగారి నాగూర్‌బీ పుట్టుకతోనే చెవుడు, మూగ కలిగి ఉంది. ఈమెకు వంద శాతం వికలాంగత్వ సర్టిఫికెట్ ఉన్నా అర్హత లేదని పింఛన్ తొలగించారు. రిమ్స్‌లో పనిచేస్తున్న డాక్టర్లు పరీక్షలు చేయకుండానే రీ వెరిఫికేషన్ చేస్తూ నిజమైన దివ్యాంగులకు అన్యాయం చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరిగి మాకు రిమ్స్‌లో పరీక్ష చేసి పింఛన్ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు వాపోతున్నారు.

అర్హత ఉన్న ప్రతి దివ్యాంగుడికి పింఛన్ ఇవ్వాలి

బద్వేలు అర్బన్ : అర్హత ఉన్న ప్రతి దివ్యాంగుడికి పింఛన్ ఇవ్వాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ఓబులేసు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ డి.మల్లేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీవెరిఫికేషన్ పేరుతో లక్షల సంఖ్యలో దివ్యాంగుల పింఛన్ తొలగించడం దారుణమన్నారు. 2010లో సదరం సర్టిఫికెట్ ద్వారా వైకల్య ధ్రువీకరణపత్రాలు పొందిన అర్హులకు సైతం రీవెరిఫికేషన్ పేరుతో పెన్షన్లు తొలగించడం సరికాదన్నారు. రీవెరిఫికేషన్ పేరుతో అనర్హులను తొలగిస్తామన్న ప్రభుత్వం అర్హత ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను సైతం తొలగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ఏరియా అధ్యక్షుడు బాలరాజు, పట్టణ అధ్యక్షుడు రఫీ, గౌరవ సలహాదారుడు మురళి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు

ఆర్థిక అక్షరాస్యతే జీవన ప్రగతికి నాంది

బ్రహ్మంగారిమఠం : ఆర్థిక అక్షరాస్యతే ప్రతి ఒక్కరికి జీవన ప్రగతికి నాంది కావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపల్ టి.ఉమామహేశ్వరుడు పిలుపునిచ్చారు. తమ కళాశాలలో సోమవారం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో గురుకులంలో సైబర్ క్రైమ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరు సైబర్ క్రైమ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏపీజీబీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ డిపాజిటర్లకు అవగాహన లేకపోవడంతో 67 వేల కోట్ల రూపాయలు డిపాజిటర్లు వదిలేశారని ఆయన తెలిపారు. విద్యార్థులు బ్యాంకు లావాదేవీల పైన అవగాహన పెంపొందించుకొని వాటి సేవలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ అక్బర్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బ్యాంకులు తక్కువ ప్రీమియంతో అందిస్తున్న పలు రకాల ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు వ్యక్తిగత స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని కోరారు. హెడ్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణ యాదవ్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్‌కు గురైన వారికి 1930 ఫోన్ కాల్స్ శ్రీరామరక్ష లాంటిది అన్నారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించే పోస్టర్స్ పాంప్లెట్స్‌ను విడుదల చేశారు. అలానే కళాకారుల బృందం సైబర్ క్రైమ్స్‌పై తమ పాటల ద్వారా విద్యార్థులకు చక్కటి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.ఉదయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్రోచర్లను విడుదల చేస్తున్న బ్యాంకు అధికారులు

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలలో ఫస్ట్ ఇయర్ బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 21 నుంచి 24వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన సీట్ అలాట్‌మెంట్ చేస్తారని, 28వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

దరఖాస్తు చేసుకోండి

గోపవరం : దివ్యాంగుల పెన్షన్ల రీవెరిఫికేషన్‌లో భాగంగా అనర్హులుగా గుర్తించి పెన్షన్ తొలగించబడిన వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని ఎంపీడీఓ రామనాథ రెడ్డి తెలిపారు. పెన్షన్ తొలగించబడిన లబ్ధిదారుల్లో ఎవరైనా అర్హులు ఉంటే సంబంధిత గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆమోదం మేరకు అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత ఉండి పెన్షన్ రాని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృథాగా పోతున్న నీరు

ప్రొద్దుటూరు : రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై నాయకుల నిర్లక్ష్యం వల్ల కుందూ, పెన్నా నదుల్లో వృథాగా నీళ్లు పోతున్నాయని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దేశ్వరం, గుండ్రేవుల, రాజోలు రిజర్వాయర్ నిర్మాణాలను పూర్తి చేయాలని అడుగుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. రూ.1000 కోట్ల అవసరమైన రాజోలి రిజర్వాయర్, మరో రూ.1000 కోట్లు అవసరమైన సిద్దేశ్వరం అలుగు, గుండ్రేవుల ప్రాజెక్టులపై రాయలసీమ నాయకులు ఎందుకు దృష్టి సారించడం లేదని తెలిపారు.

20 వరకు ఫిర్యాదులు స్వీకరణ

చాపాడు : ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం పెట్టుబడి సాయంగా వేసిన నగదు అందని బాధిత రైతులు ఈ నెల 20వ తేదీలోగా ఫిర్యాదులు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత తెలిపారు. బాధిత రైతులు తమ గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ధ్రువీకరణ పత్రాలు అందజేసి నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కోరారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

బ్రహ్మంగారిమఠం : మండలంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంపల్లి అజయ్ కోరారు. ఈ మేరకు ఆయన తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించి విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మంగారిమఠంలోని నరసాపల్లి ఎంపీపీ పాఠశాలలో గత ప్రభుత్వంలో పాఠశాల అభివృద్ధిలో భాగంగా నాడు - నేడు పనులు జరిగాయన్నారు. కొద్దిపాటి పనులు చేసి, ప్రహరీ గోడను కట్టని కారణంగా ఆవరణలో వర్షపు నీరు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదే విధంగా సోమిరెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాల పరిస్థితి కూడా అదే విధంగా ఉందని, ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. కాగా బాయ్స్ హైస్కూల్‌లో ఇంటర్ విద్యను చేర్చారని, కానీ ఇంటర్ విద్యార్థులు సంవత్సరం కాలం పాటు పాఠశాలలో ఉన్నప్పటికీ అవసరమైన క్లాస్ రూమ్స్, అధ్యాపకులు లేని కారణంగా బయటికి వెళ్లినట్టు చెప్పారు. తక్షణమే విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించి తరగతులు ప్రారంభించాలని కోరారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా విద్యార్థులకు సామగ్రి అందకపోవడం బాధాకరమన్నారు. వీలైనంత తొందరగా విద్యార్థులకు యూనిఫాం, సామగ్రిని అందించాలని డిమాండ్ చేశారు. కాగా పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డులు విద్యార్థి సంఘాలను పాఠశాలల ఆవరణలోనికి రాకూడదంటూ ఉత్తర్వులు జారీ చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, రాజశేఖర్ ఉపాధ్యక్షుడు రమేష్‌లు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పంటల బీమా నమోదు గడువు పొడిగింపు

బి.కోడూరు : మండలంలోని పది పంచాయతీల పరిధిలోని రైతులు ఖరీఫ్ పంటలు బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సాగు చేసిన పంటలైన పసుపు, ఉల్లి, కంది, వరి, మినుము, జొన్న తదితర పంటలకు బీమా చేసుకునే అవకాశం ఉందన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని రైతుసేవా కేంద్రానికి వెళ్లి పంట వేసినట్లు పంట ధ్రువీకరణపత్రం పొంది ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని మీ దగ్గరలోని మీసేవ కేంద్రంలో పంటల బీమాకు డబ్బులు చెల్లించాలన్నారు. కావున మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అమ్మను, మాతృ భాషను గౌరవించాలి

బద్వేలు అర్బన్ : జన్మనిచ్చిన తల్లిదండ్రులను, మాతృభాష అయిన తెలుగును తప్పక ఆదరించి గౌరవించాలని రాష్ట్ర తెలుగు భాషా వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. తెలుగు భాష అవగాహన సదస్సులలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20% కూడా తెలుగు భాష అమలు కావడం లేదన్నారు. అన్ని విద్యాసంస్థలలో తెలుగు తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, తేనెలొలుకు తెలుగు భాష తీయదనాన్ని తెలుపుతూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు పద్య పఠన, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఈ నెల 29వ తేదీ ప్రతి విద్యాసంస్థలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించాలని, అలాగే జిల్లా కేంద్రమైన కడపలో ప్రభుత్వ పక్షాన కలెక్టర్ మాతృభాషా దినోత్సవం నిర్వహించి తెలుగు భాష అభివృద్ధికి కృషి చేసిన ప్రముఖులకు పురస్కారం ఇవ్వాలన్నారు. తొలుత తెలుగు భాష అభివృద్ధికి తన సర్వస్వమర్పించిన గిడుగు వెంకటరామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం బద్వేల్ శాఖ అధ్యక్షులు రామసుబ్బారెడ్డి, ఎం.పిచ్చయ్య, ఎం.కొండయ్య, ఎస్.కొండయ్య, శ్రీరాములు, మొల్ల సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హనుమంతరావు తదితరులు

అధ్వానంగా ఆశ్రమం వీధి రోడ్డు



ప్రొద్దుటూరు: బురదమయంగా ఉన్న మహర్షి ఆశ్రమం స్కూల్ వీధి రోడ్డు

ప్రొద్దుటూరు : స్థానిక ఒకటో వార్డు పరిధిలోని మహర్షి ఆశ్రమం స్కూల్ వీధి రోడ్డు అధ్వానంగా మారింది. గత వారం రోజులుగా కురిసిన వర్షాల కారణంగా ఈ వీధులు బురదమయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జమ్మలమడుగు రోడ్డు నుంచి రామేశ్వరం రోడ్డు వరకు లింక్ రోడ్డు ఉంది. మాస్టర్ ప్లాన్‌లో 60 అడుగులు ఉన్నా ప్రస్తుతం అక్కడ 15 అడుగులు మాత్రమే రోడ్డు ఉంది. అనేక చోట్ల రోడ్డును ఆక్రమించి నిర్మాణాలను చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్డును విస్తరింపజేసి నూతనంగా రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షంతో రైతులకు కష్టాలు

రాజుపాళెం : గత వారం, పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. చాలా ప్రాంతాల్లో పొలాల్లో నీరు నిలవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. కలుపు మొక్కలు విపరీతంగా పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. వారం రోజుల పాటు వర్షం పడకుంటే కలుపు మొక్కలను ఏరివేసుకొని, పురుగు మందులను పిచికారీ చేసుకుంటామంటున్నారు. అలాగే బీడు భూముల్లో పిచ్చి మొక్కలు విపరీతంగా ఉన్నాయని అంటున్నారు.



రాజుపాళెం : పత్తి పంటలో నిలిచిన వర్షం నీరు

చినుకు పడితే చెరువే!



పోరుమామిళ్ల: సాయిబాబా మందిరం దగ్గర నిలిచిన నీరు

పోరుమామిళ్ల : పట్టణంలో వర్షం పడితే నీరు మొత్తం రోడ్డుపైన, గోతుల్లో నిలిచిపోయి చెరువును తలపిస్తున్నది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. డివైడర్ పనులు పూర్తి కాకపోవడం, మురుగునీరు, వర్షపు నీరు వెళ్లే సదుపాయం లేకపోవడంతో చిన్న పాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. స్టేట్ బ్యాంక్ వద్ద, సాయిబాబా మందిరం వద్ద మోకాటి లోతుతో నీరు నిలుస్తోంది. ఈ పరిస్థితిపై హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఫణిరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఫణిరావు కోరారు.

బిల్లులు చెల్లించండి మహాప్రభో!

- ఎమ్మెల్యే వరద లేఖతో ఆగిన కాంట్రాక్టు బిల్లులు
- మున్సిపాలిటీలో పనులు చేయడానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు
- కమిషనర్‌కు లేఖ



మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కాంట్రాక్టర్లు

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి లేఖతో గత ఏడాదికిపైగా మున్సిపాలిటీలో పనులకు సంబంధించిన బిల్లులు ఆగిపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా పనులు చేపట్టడానికి ధైర్యంగా ముందుకు రాలేని పరిస్థితి నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2019-24 వరకు మున్సిపాలిటీలో విరివిగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. ఎక్కడ చూసినా రోడ్లు, కాలువలతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. అభివృద్ధి పనులకు సంబంధించి మున్సిపలిటీపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా ప్రత్యర్థులే టార్గెట్‌గా భావించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ఏడాది జూలైలో స్వయంగా ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. వాస్తవానికి ఎమ్మెల్యే ప్రొద్దుటూరు నియోజకవర్గంలో చేపట్టిన అన్ని పనులపై ఫిర్యాదు చేశారు. ప్రత్యేకంగా మున్సిపాలిటీలో కోట్ల రూపాయలతో చేపట్టిన 1155 పనులకు సంబంధించి విజిలెన్స్ ఎంక్వైరీ చేయాలని, అంత వరకు బిల్లులు పాస్ చేయొద్దని లేఖ రాశారు. ఈ మేరకు సీడీఎంఏ అధికారులు ప్రత్యేకంగా పది రోజుల పాటు ప్రొద్దుటూరులో మకాం వేసి అన్ని పనులపై విచారణ చేపట్టారు. పనుల్లో అవినీతి జరిగిందని ఇప్పటి వరకు అధికారులు ధ్రువీకరించలేదు. సమస్య సద్దుమణిగింది.

మళ్లీ మంత్రికి లేఖ

ఇది ఇలా ఉండగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ పనులపై విచారణ చేపట్టాలని మళ్లీ కోరారు. లేఖ మీద లేఖ ఇస్తూ విచారణ పేరుతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు నష్టపోతున్నారు. వాస్తవానికి గడిచిన సార్వత్రిక ఎన్నికల ముందు నుంచి ఏడాదిన్నరగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. ఈ వివాదం కారణంగా గత ఏడాదిగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇటీవల ఇచ్చిన లేఖలో ప్రత్యేకించి వైఎస్సార్‌సీపీకి చెందిన కాంట్రాక్టర్లను టార్గెట్ చేసి తమకు అనుకూలమైన వారి పేర్లను మినహాయించారు. స్వయంగా ఎమ్మెల్యే వర్గానికి చెందిన కాంట్రాక్టర్లే ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నారు. తమ పేర్లు ఎమ్మెల్యే ఇచ్చిన లేఖలో లేవని అంటున్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని కలిసి తమకు త్వరగా బిల్లులు చెల్లించాలని మున్సిపల్ కాంట్రాక్టర్లు లేఖ ఇచ్చారు.

మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాలి

ప్రొద్దుటూరు : కూరగాయల మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత వ్యాపారులపైనే ఉందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. అధ్వానంగా ఉన్న మార్కెట్‌ను సోమవారం కమిషనర్ పరిశీలించారు. వర్షం నీరు బయటికి పోకపోవడంతోపాటు ఎక్కడపడితే అక్కడ చెత్త నిల్వలు ఉండటంతో మార్కెట్‌లో దుర్వాసన వెదజల్లుతోంది. సమస్య తీవ్రతను గమనించిన కమిషనర్ వ్యాపారులను హెచ్చరించారు. మార్కెట్‌ను శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తామని, లోపలికి వాహనాలు రాకుండా చూడాల్సిన బాధ్యత వ్యాపారులపైనే ఉందన్నారు. టాయిలెట్లు కూడా కొత్తవి నిర్మిస్తామన్నారు. అనంతరం గోకుల్ నగర్‌లో పర్యటించి నిబంధనలను ఉల్లంఘించిన చికెన్ సెంటర్‌ను మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు. చికెన్ షాపులోని వేస్టేజి నీరంతా వీధిలోకి వస్తోందని గోకుల్‌నగర్ వాసులు ఫిర్యాదు చేశారు. సాయంత్రం మార్కెట్ వ్యాపారులు ఖాసీం, వలి తదితరులను కమిషనర్ పిలిపించి ప్రత్యేకంగా చర్చించారు. కమిషనర్ వెంట డీఈ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మార్కెట్ వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

చిన్నారుల టీకాలపై స్పెషల్ డ్రైవ్

ప్రొద్దుటూరు రూరల్ : అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఐదు నుంచి ఏడేళ్లలోపు, 10 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు రెండు రకాల టీకాలు ఈ నెల 23వ తేదీ వరకు వేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కామనూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా పేర్కొన్నారు. మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం చిన్నారులకు టీకాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5-7 ఏళ్లలోపు పిల్లలకు డీపీటీ, 10-16 ఏళ్లలోపు పిల్లలకు టీడీ టీకాలను ఉచితంగా వైద్య సిబ్బంది వేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ టీకాల వల్ల పిల్లల్లో డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం రాకుండా అరికడతాయన్నారు. ఈ మూడు జబ్బుల బ్యాక్టీరియాల వల్ల పిల్లల్లో తీవ్ర అనారోగ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ఆరోగ్య సిబ్బంది జాస్మిన్, హేమ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఉత్సాహంగా ఉట్లోత్సవం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరురోడ్డులో గల శ్రీకృష్ణమందిరంలో కృష్ణాష్టమి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో బద్వేలు రూరల్ సీఐ ఎం. నాగభూషణ్, ఎస్ఐలు సత్యనారాయణ, శ్రీకాంత్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొనగా స్థానిక యాదవనగర్‌కు చెందిన పోలుబోయినపవన్ విజేతగా నిలిచాడు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అలాగే గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీకృష్ణ జయంతోత్సవ కమిటీ సభ్యులు, నాయకులు వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ తదితరులు పాల్గొన్నారు.



ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ, కమిటీ సభ్యులు